క్లుప్తంగా

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కొరిటెపాడు(గుంటూరు): విద్యుత్ గుంటూరు సర్కిల్ పరిధిలో ఆదివారం బిల్లులు వసూలుకు ఆదివారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పర్యవేక్షక ఇంజినీర్ చల్లా రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి నుంచే నేరుగా విద్యుత్ బిల్లులు చెల్లించేలా మొబైల్లో ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్, ఫోన్ పే, గూగుల్ పేల నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

బాపయ్యనగర్‌లో సంప్రదాయ నృత్య ప్రదర్శనలు



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలరోడ్డులోని బాపయ్యనగర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఈసందర్భంగా శుక్రవారం రాత్రి అను డ్యాన్స్ అకాడమీ నృత్య కారిణుల బృందం ఇచ్చిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నాట్య గురువు అనుశేఖర్ పర్యవేక్షణలో విఘ్నేశ్వరుని స్తుతిస్తూ భక్తిగీతాలకు చేసిన నృత్యంతోపాటు శ్రీనివాస కళ్యాణం, రఘుకుల తిలకారామ, భరతవేదమున, నవ దుర్గ తదితర గీతాలకు అద్భుతమైన ప్రదర్శనలు బాపయ్యనగర్ ప్రజలను అలరించాయి. ఈసందర్భంగా ఆర్ ఆర్ రిసార్ట్స్ అండ్ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నాదెండ్ల రాంబాబు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు నృత్య కారుణుల బృందాన్ని సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం



పట్నంబజారు: ప్రతి ఒక్కరిలో భక్తి భావం అవసరమని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని శనివారం పలు పందిళ్లలో అన్నదానం చేశారు. 14వ డివిజన్ పరిధిలోని సంగడిగుంటలో హరీష్ ఫ్రెండ్ సర్కిల్, 17వ డివిజన్ దర్గా మాన్యంలో వరసిద్ధి వినాయక ఫ్రెండ్స్ సర్కిల్, రామ్ రహీం నగర్‌లో జాఫర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఏసురత్నం, నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, పలు పందిళ్ల నిర్వాహకులు, యాదాల చిన్న, ఆయూబ్ జానీ, మహేష్, రాజేష్, చింతా శ్రీను, శ్రీక్రాంత్ పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ శాంతి కోరుతూ శనివారం జేకేసీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా యుద్ధం వద్దు– శాంతి ముద్దు, పర్యావరణాన్ని కాపాడుదాం, జీవకోటి మనుగడను కొనసాగిద్దాం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు.

వైద్య అధికారులకు శిక్షణ



గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బందికి, ఆర్. సి.హెచ్ 2.0 వర్షన్ రోల్ అవుట్ మీద డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డెప్యూటీ డైరెక్టర్ శివ శంకర్ బాబు మాట్లాడుతూ ఆర్.సి.హెచ్ 2.0 ను అభ ఐడితో లింక్ చేస్తూ, ఆరోగ్య సేవలను విస్తరించి, జాతీయస్థాయిలో ఎక్కడికి వెళ్లినా, సేవలు అందుకునే విధంగా చేయడం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో అన్ని స్థాయిలలో సిబ్బంది ఇచ్చిన సేవలు వారే నమోదు చేసే విధంగా రూపొందించడం జరిగిందని వివరించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ రియల్ టైం సర్వీసెస్ నమోదు చేయడం వలన మాతృ, శిశు మరణాలు తగ్గించవచ్చన్నారు. ప్రస్తుతం శిక్షణ పొందిన వారు డివిజన్ స్థాయిలో సిబ్బందికి శిక్షణను ఇస్తారని వెల్లడించారు.

జేడీఆర్ఎఫ్ ప్రాంతీయ కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: జర్నలిస్ట్స్ డెమొక్రటిక్ రైట్స్ ఫోరం(జేడీఆర్ఎఫ్) ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యదర్శిగా సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ఎం.రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. పలువురు అభినందించారు.


అవి.. తింటే ఆరోగ్యానికి తంటా!

గుంటూరు అరండల్‌పేటకు చెందిన శ్రీదేవి ఇంటర్ చదువుతోంది. కొంతకాలంగా కళాశాల క్యాంటీన్‌లో ఫాస్ట్‌ఫుడ్స్ తింటూ ఇంటి భోజనం పక్కన పడేసింది. ఇటీవల రక్తపు విరేచనాలు అవడంతో చికిత్స కోసం జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను తల్లిదండ్రులతో సంప్రదించింది. వైద్యులు పరీక్షలు చేసి ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం ద్వారా అవుతున్నట్లు నిర్ధారించి చికిత్స చేసి పంపించారు.

గుంటూరు శ్రీనగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి రాకేష్ పరీక్షల సమయంలో తీవ్రమైన కడుపునొప్పి సమస్యతో గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించాడు. పరీక్షలు చేసి కౌన్సెలింగ్ చేశారు. పరీక్షల ఒత్తిడి వల్ల ఆహారం సక్రమంగా తీసుకోవడం లేదని నిర్ధారణలో తేలింది. సకాలంలో సరైన ఆహారం తీసుకోవాలంటూ సూచించారు. ఇలా ఎంతో మంది విద్యార్థులు, చిన్నారులు సైతం ఫాస్ట్‌ఫుడ్స్‌కు అలవాటు పడి రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. సకాలంలో గుర్తించి చికిత్స అందించని పక్షంలో తీవ్రంగా అరోగ్యం పాడయ్యే ప్రమాదం ఉంది.

- ఫాస్ట్ ఫుడ్స్‌తో అనారోగ్యం
- చిన్న వయస్సులోనే గ్యాస్ట్రబుల్ సమస్యలు
- పొంచిఉన్న మరిన్ని జబ్బులు





గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్న దృశ్యాలు

గుంటూరు మెడికల్: కంప్యూటర్ కాలంలో పిల్లల చిరుతిళ్లు సైతం మారిపోయాయి. ఒకప్పుడు చాక్లెట్, బిస్కెట్, వేరుశనగ ఉండలు, జీడీలు, పుల్ల ఐస్‌తోపాటుగా జామ, రేగిపండు లాంటి సీజనల్ పండ్లు తినేవారు. పాఠశాలల వద్ద దుకాణాల్లో సైతం ఇవి అమ్మేవారు. నేడు పరిస్థితి మారిపోయింది. రంగుల రంగుల ప్యాకెట్స్‌లో జంక్ ఫుడ్స్‌ను దండలుగా వేలాడదీసి, పిల్లలను ఆకర్షించేలా షాపుల వద్ద పెడుతున్నారు. రంగుల ప్యాకెట్లతో తియ్యటి విషం ఉంటుందని, వాటిని తింటే రోగాలు వస్తాయని తెలియక చిన్నారులు వ్యాధుల బారిన పడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల తిండి విషయంలో ఒకింత శ్రద్ధ చూపించని పక్షంలో తీవ్ర అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో వెయ్యి పైగా షాపులు

జిల్లాలో చిరుతిళ్లు అమ్మే దుకాణాలు వెయ్యి పైగా, తయారీ దుకాణాలు 100 వరకు ఉన్నాయి. కేవలం ఒక్క గుంటూరు నగరంలోనే 40 హోల్‌సేల్ షాపులు ఉండగా, రిటైల్ షాపులు 100 వరకు ఉన్నాయి. వీటిల్లో ఫుడ్‌సేఫ్టీ కంట్రోల్ అధికారుల వద్ద అనుమతులు తీసుకుని, నిబంధనల ప్రకారం విక్రయాలు చేసేవారి సంఖ్య 100కు మించి ఉండదు. కొందరు వ్యాపారులు అధిక లాభాల కోసం నాసిరకం బియ్యం, గోధుమ, మైదా, శనగపిండి, పామాయిల్‌తో ఇళ్లలోనే చిరుతిళ్లు తయారు చేస్తూ, నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఇలాంటి ఆహారం తినడం ద్వారా పిల్లలు చిన్న వయస్సులోనే గ్యాస్ సంబంధిత సమస్యలతో వైద్యులను సంప్రదిస్తున్నారు.

చిన్న వయస్సులో వ్యాధులకు కారణాలు

ఎక్కువగా పిజ్జా, బర్గర్లు, న్యూడిల్స్, కుర్‌కురేలు వంటి ఫాస్ట్‌ఫుడ్స్ తినడం వల్ల పిల్లల శరీరాల్లో చెడు కొలెస్ట్రాల్ పెరిగిపోయి వ్యాధుల బారిన పడుతున్నారు. పాఠశాలల్లో, ఇళ్ల వద్ద వ్యాయామం లేకపోవడం, చదువుల ర్యాంకుల కోసం విపరీతమైన ఒత్తిడి చేయడం, పరీక్షలంటే పిల్లల్లో తీవ్ర ఆందోళన ఉండటం వల్ల గ్యాస్ సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. ఐదేళ్ల నుంచి 17ఏళ్ల మధ్య వారు ఎక్కువగా వ్యాధుల బారిన పడుతున్నారు.

లక్షణాలు

ఫాస్ట్‌ఫుడ్స్ వల్ల వ్యాధుల బారిన పడిన వారిలో తేపులు ఎక్కువగా వస్తాయి. అల్సర్లు ఏర్పడడం, లూజు మోషన్స్, రక్తపు విరోచనాలు వంటి లక్షణాలు ఉంటాయి.

బాధితుల వివరాలు

గుంటూరు జీజీహెచ్‌లో 2021లో 480 మంది, 2022లో 744 మంది, 2023లో 900 మంది, 2024లో 1023 మంది, 2025లో 1173 మంది ఐదేళ్ల నుంచి 17 ఏళ్లలోపు వారు ఫాస్ట్‌ఫుడ్ తిని వివిధ రకాల అనారోగ్య సమస్యలతో గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో చికిత్స పొందారు.

జంక్ ఫుడ్స్‌తో రోగాలు



జంక్ ఫుడ్స్ వల్ల పిల్లల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఎక్కువగా జీర్ణకోశ సంబంధిత సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎక్కువసార్లు కాచిన వంటనూనెతో చిరుతిండ్లు తయారు చేయడం వల్ల జీర్ణసంబంధిత సమస్యలు వస్తున్నాయి. బాల్యంలోనే స్థూలకాయం బారిన పడుతున్నారు. ఒక్కసారి తింటే వారానికి సరిపడా ఉప్పు పిల్లల శరీరంలోకి వెళ్లిపోతుంది. చిన్నవయస్సులోనే బీపీ, షుగర్‌లకు కూడా జంక్ ఫుడ్సే కారణం. రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడతాయి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు

బూత్ కమిటీలను పటిష్టం చేయాలి



అంబటి రాంబాబును సన్మానిస్తున్న పలువురు నాయకులు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

నగరంపాలెం: జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బూత్ కమిటీలను పటిష్టం చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లో మాజీ మంత్రి అంబటి రాంబాబును జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడిగా నియమితులైన ఉడుముల పిచ్చిరెడ్డి, పలువురు నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం అంబటి రాంబాబుని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఫిరంగిపురం మండలం అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దాసరి సురేష్, సొసైటీ మాజీ చైర్మన్ చేవూరి రామ్మోహన్‌రెడ్డి, మైనారిటీ సెల్ ఫిరంగిపురం అధ్యక్షుడు మస్తాన్‌వలి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాల్మన్, ఐటీ విభాగం అధ్యక్షుడు ప్రతాప్, పార్టీ జిల్లా కార్యదర్శి తుపాకుల కృష్ణ, ఫిరంగిపురం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మస్తాన్, బాలిరెడ్డి పాల్గొన్నారు. పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కొల్లూరు శివప్రసాదరావు, గుంటూరు సిటీ యువజన విభాగం అధ్యక్షుడు ఏటీ కోటేశ్వరరావు, ఐటీ విభాగం అధ్యక్షుడు ఏరువా ఇన్నారెడ్డి శనివారం మాజీ మంత్రి అంబటి రాంబాబుని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

వైఎస్సార్ సీపీకి యువతే బలం

పట్నంబజారు: రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీకి లేని యువజన బలం వైఎస్సార్ సీపీకి సొంతమని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. పార్టీ యువజన విభాగం నగర అధ్యక్షుడిగా నియమితులైన ఏటీ కోటేశ్వరరావు శనివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. యువజన విభాగం నగర అధ్యక్షుడిగా నియమితులైన కోటేశ్వరరావును దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి నుంచి యువతకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు.

మత సామరస్యానికి ప్రతీక వినాయక చవితి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



చవితి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: 'భక్తి ప్రపత్తులు, సంస్కృతి సంప్రదాయాలకు మాత్రమే కాక సామాజిక చైతన్యానికి ప్రతీక వినాయక చవితి వేడుక అని శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. అందుకే కులమతాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాల ప్రజలు ఈ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకుంటారని చెప్పారు. నగరంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చవితి పందిళ్లలో అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. తొలుత మత సామరస్యానికి అసలు సిసలు నిర్వచనం చాటి చెప్పేలా గుంటూరు కంకరగుంట ఓవర్ బ్రిడ్జి సమీపంలోని గాజుల వారి వీధిలో ముస్లిం సామాజిక వర్గానికి చెందిన విద్యార్థి విభాగం నేత కరీంలాలా వినాయకుడి విగ్రహాన్ని లేళ్ల అప్పిరెడ్డి సందర్శించారు. అనంతరం బృందావన్‌గార్డెన్స్, హౌసింగ్‌బోర్డు కాలనీ, హనుమాన్ నగర్ 2వ లైన్, ఏటీ అగ్రహారం 12, 17 లైన్లు, రామిరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చవితి పందిళ్లలో కొలువుదీరిన గణనాథులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, ఆయా మండపాల నిర్వాహకులు యడ్లపల్లి సాంబశివరావు, సాయి, మోహన్, వంగా తరుణ్‌కుమార్ రెడ్డి, నాగండ్ల ఓంకారేశ్వర రావు, పసుపులేటి రామకృష్ణ, అరవింద్, లక్ష్మి, అన్వేష్, రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, రమణయ్య, బొమ్మల నాగరాజు, నూకరాజు, కోటేశ్వరరావు, స్థానిక నేతలు సురసాని వెంకటరెడ్డి, వనజాక్షి, సీతారామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, యర్రం కృష్ణారెడ్డి, పార్టీ నేతలు ఓర్సు శ్రీనివాసరావు, పరిశపోగు శ్రీనివాసరావు, పానుగంటి చైతన్య, షేక్ రబ్బానీ, కొండిన్య పాల్గొన్నారు.

దుష్ట పాలనపై సెల్ ఫోన్ ఆయుధంగా యుద్ధం

పట్నంబజారు: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించడంలో సోషల్ మీడియా విభాగం మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. దుష్ట పాలన అంతానికి నిస్వార్థంగా తమ సెల్ ఫోనునే ఆయుధంగా మలచుకుని పార్టీ సోషల్ మీడియా సాగిస్తున్న యుద్ధం అనిర్వచనీయమన్నారు. పార్టీ పశ్చిమ నియోజకవర్గ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా నియమితులైన రమేష్ సాహు శనివారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి సోషల్ మీడియా విభాగం వెన్నెముక లాంటిదన్నారు. ఎన్ని కష్టాలు పడినా.. మరెన్ని కేసులు పెట్టినా.. మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతున్న నిజమైన జగనన్న వారియర్స్ సోషల్ మీడియా సైన్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు వలివేటి వెంకటరమణ, షేక్ రబ్బానీ, యాదాల చిన్న, కొండిన్య, సుబ్బరాజు, చందు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా మిషన్ గ్రీన్ గుంటూరు

కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు నగరపాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా ఎండ్ టూ ఎండ్ రోడ్ల నిర్మాణం, మిషన్ గ్రీన్ గుంటూరు ద్వారా పచ్చదనం పెంపు వంటి చర్యలు తీసుకుంటుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాం(ఎన్.క్యాప్)లో భాగంగా నగరంలో చేపట్టాల్సిన అంశాలపై వివిధ శాఖల అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వాయు కాలుష్యం తగ్గించి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించేందుకు మిషన గ్రీన్ గుంటూరులో భాగంగ దశల వారీగా 5 లక్షల మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ప్రొఫెసర్ బాల ప్రసాద్ సూచనల మేరకు రానున్న కాలంలో గుంటూరు నగరాన్ని కాలుష్య రహిత వాతావరణ నగరంగా తీర్చిదిద్దుకోవడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి ముందుకు సాగుతామన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ప్రొఫెసర్ బాలప్రసాద్(ఆంధ్రా యూనివర్సిటీ), డీఎఫ్ఓ హిమశైలజ, జిల్లా పరిశ్రమల శాఖ డీడీ మధుసూదన్ రెడ్డి, ఇన్‌చార్జి డీఎస్ఓ కె.శ్రీనివాస్, ఆర్టీఓ కె.శ్రీహరి, ఏఓ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లపై చర్యలు

నగరంలో అనధికారిక లే అవుట్లు, ప్లాట్లు యజమానులు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం 2020 లో రెగ్యులరైజ్ చేయించుకోకపోతే, వాటికి ప్రభుత్వ సేవలను, రిజిస్ట్రేషన్ నిలిపివేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ క్రింద అక్టోబర్ 24 లోపు భూములను క్రమబద్ధీకరించుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏడీ నాగేశ్వరరావుకు సన్మానం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ శనివారం పదవీ విరమణ చేసిన చింతలపూడి నాగేశ్వరరావును ఆస్పత్రి మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానించారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా నాగేశ్వరరావు సేవలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, ఆర్డీ కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్ బండి పాల్‌సుధాకర్, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్‌కుమార్, మద్దు ప్రేమజ్యోతిబాబు, పలువురు కార్యాలయ ఉద్యోగులు, అధికారులు హాజరై కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నాగరాజు, గన్నేపల్లి శ్రీనివాస్, డక్కుమళ్ల సాంబశివరావు, కార్తీక్, వేణు, పద్మ, విజయశ్రీ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

డాక్టర్ నారాయణరావుకు ఘన సన్మానం



డాక్టర్ నారాయణరావు, డాక్టర్ శైలజ దంపతులను సన్మానిస్తున్న వైద్యులు, విద్యార్థులు

గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆర్థోపెడిక్ సర్జన్‌గా 33 సంవత్సరాలు సుదీర్ఘకాలం వైద్య సేవలు అందించిన గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి, ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.వి.నారాయణరావు పదవీ విరమణ సందర్భంగా శనివారం ఘన సన్మానించారు. గుంటూరు జీజీహెచ్ నుంచి గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియం వరకు వైద్య విద్యార్థులు, వైద్యులు డాక్టర్ నారాయణరావును దంపతులను మేళతాళాలతో పూలవర్షం కురిపిస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. పలువురు సీనియర్ వైద్యులు డాక్టర్ అరవింద్‌బాబు, డాక్టర్ లక్ష్మణస్వామి, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ నరేష్, డాక్టర్ చంద్రశేఖరనాయుడు, డాక్టర్ దక్షిణా మూర్తి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ఘంటా వర ప్రసాద్, విదేశాల్లో, దేశంలోని పలు రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో సేవలందిస్తున్న ఆర్థోపెడిక్ సర్జన్లు, ఇతర వైద్య విభాగాలకు చెందిన వైద్యులు, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ బాబ్జి, శ్యామ్ కుమార్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, తదితరులు హాజరై డాక్టర్ నారాయణరావు చేసిన సేవలను కొనియాడారు.

ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలకు సత్కారం



నగరంపాలెం: విధి నిర్వహణలో ప్రజా, శాంతి భద్రతల కోసం అహర్నిశలు శ్రమించారని జిల్లా ఏఎస్పీ(పరిపాలన) జీవీ రమణమూర్తి అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు బి.మధుసూదన్‌రావు (పాత గుంటూరు పీఎస్), ఎస్కే ఇబ్రహీం(జిల్లా ఏఆర్)లను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఏఎస్పీ(పరిపాలన) రమణమూర్తి మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలు, ఆరోగ్యంగా జీవించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, సురేష్, శివరామకృష్ణ, పోలీస్ అసోసియేషన్ సభ్యులు మైలా సాంబశివరావు, హుస్సేన్, లక్ష్మణ్, రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు దళవాయి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డోలు విద్వాంసుడు ఆదిశేషయ్య చిరస్మరణీయుడు



కాజా వెంకటసుబ్రహ్మణ్యంకు భూసురపల్లి ఆదిశేషయ్య కళా పురస్కారం అందజేత

నగరంపాలెం: దశాబ్దాలపాటు డోలు విద్వాంసునిగా కీర్తి శిఖరాలను భూసురపల్లి ఆదిశేషయ్య అధిరోహించారని రైతు సాధికార సంస్థ సీఈఓ బి.రామారావు అన్నారు. ప్రఖ్యాత డోలు విద్వాంసులు దివంగత భూసురపల్లి ఆదిశేషయ్య దశమ ఆరాధన శనివారం బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావు మాట్లాడుతూ రసజ్ఞుల హృదయాలలో చెరగని ముద్ర వేశారని అన్నారు. ఆయన జీవితం చరితార్థమని పేర్కొన్నారు. ఇప్పటికి ఆయన ఆదర్శాలను కొనసాగించడం ప్రశంసనీయమని అన్నారు. ప్రముఖ సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ డోలు వాయిద్యం సాధనలో కీర్తి గడించారని అన్నారు. ఎందరికో మార్గదర్శకం చేసిన మహోన్నత వ్యక్తిత్వమని కొనియాడారు. అనంతరం లయబ్రహ్మ భూసురపల్లి ఆదిశేషయ్య కళా పురస్కారాన్ని ప్రముఖ నాట్యాచార్యులు డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యంకు అందించారు. అనంతరం శ్రీసాయి మంజీరా కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సద్గురు శ్రీత్యాగరాజస్వామి విరచిత 'నౌకా చరిత్ర' యక్షగాన ప్రదర్శన అలరించింది. సభలో టాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, పాలకమండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, గాయత్రి మహిళా సంగీత సన్మండలి ప్రధాన కార్యదర్శి ఎంవై. శేషరాణి, ఆదిశేషయ్య కుమారుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధించాలి



తెలుగు కవులు, ప్రముఖుల వేషధారణలోని విద్యార్థులతో విష్ణువర్ధన్, వరప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంగ్లభాషలో ప్రావీణ్యం సాధించే ముందుగా విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధిచాలని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని సీతారామయ్య పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ వేడుకలు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా విద్యార్థులు గిడుగు రామ్మూర్తి గురించి ఉపన్యాసాలు, పాటలు, కవితలతో అలరించారు. పద్యపఠన, నాటక ప్రదర్శన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో చిన్నారులు వివిధ ప్రముఖ తెలుగు కవుల వేషధారణలతో అలరించారు. కార్యక్రమం లో పాఠశాల పాలక వర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, ప్రైమరీ కోఆర్డినేటర్ దిల్ జహాన్, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ టి.శ్రీదేవి, ఇన్‌చార్జ్ కె.హరి ప్రియ పాల్గొన్నారు.

రిటైర్డ్ రైల్వే ఉద్యోగులకు వైద్య పరీక్షలు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ రిటైర్డ్ ఉద్యోగుల కోసం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినట్లు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ శనివారం తెలిపారు. రమేష్ హాస్పిటల్, శంకర ఐ హాస్పిటల్, బీఎంఆర్ హాస్పిటల్, ఒమేగా క్యాన్సర్ హాస్పిటల్ వంటి ఎంప్యానెల్డ్ ఆసుపత్రుల నుంచి కార్డియాలజిస్టులు, నేత్ర వైద్యులు, అంకాలజిస్టులు, ఆర్థోపెడిక్ సర్జన్లు వంటి ప్రముఖ నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, రొమ్ము మరియు గర్భాశయ క్యాన్సర్లు, వక్రీభవన లోపాలు, కంటిశుక్లం మరియు రెటినోపతి కోసం స్క్రీనింగ్, అదనంగా, వృద్ధాప్య ఆరోగ్య కౌన్సెలింగ్, మందుల పంపిణీ చేశారు. మొత్తం 110 మంది పదవీ విరమణ చేసిన రైల్వే లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య సంరక్షణ సేవలను పొందారు, నిపుణుల సంప్రదింపులు మరియు నివారణ స్క్రీనింగ్‌ల ప్రయోజనాన్ని పొందారని సీనియర్ డీసీఎం తెలిపారు.

విజయవాడ సభకు తరలి వెళ్లిన బీజేపీ నేతలు



గుంటూరు మెడికల్: బీజేపీ ఆధ్వర్యంలో తరతరాల సంచార సమాజం త్యాగాలను స్మరించుకుంటూ సంచారజాతుల విముక్తి దినోత్సవ మహాసభ శనివారం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు నుంచి జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు, నేతలు విజయవాడ మహాసభకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు డాక్టర్ ఉమా శంకర్, బజరంగ్ రామకృష్ణ, జోషు సత్యనారాయణ, తోట శ్రీనివాస్, సురేష్ జైన్, పాలపాటి రవి, మోతే శేషగిరి, చెంచు కుల నాయకులు, సంచార జాతి నాయకులు సభకు తరలి వెళ్లారు.